**Eenadu**

# సముద్ర ఆర్థిక వ్యవస్థలో కోటి కొత్త ఉద్యోగాలు

## 2020 కల్లా అందుబాటులోకి వస్తాయన్న గడ్కరీ

**దిల్లీ:** దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రతిష్ఠాత్మక 'సాగరమాల' ప్రాజెక్టు గొప్ప ఊపు తీసుకురానున్నట్లు కేంద్ర రోడ్డురవాణా, రహదారులు, నౌకాయాన మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత్వంలో 'సముద్ర ఆర్థిక వ్యవస్థ' 2020 కల్లా కోటి నూతన ఉద్యోగాలను సృష్టించనుందని పేర్కొన్నారు. సింగపూర్‌లో గురువారం జరిగిన ఓ సదస్సులో గడ్కరీ మాట్లాడారు. 'సాగరమాల' కింద ఇప్పటివరకు 173 ప్రాజెక్టులు గుర్తించామని, వీటికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమని పేర్కొన్నారు.

**సాగరమాల కంపెనీని ఏర్పాటు:** ప్రతిష్ఠాత్మక 'సాగరమాల' ప్రాజెక్టుల వ్యవహారాలను పర్యవేక్షించేందుకుగాను 'సాగరమాల అభివృద్ధి కంపెనీ'ని ఏర్పాటుచేస్తున్నట్లు కేంద్రప్రభుత్వం గురువారం ప్రకటించింది. రూ.వెయ్యికోట్ల ప్రాథమిక అధీకృత మూలధన వాటాతో ఈ కంపెనీని ప్రారంభించింది.